డిసెంబరు 8 నుంచి శీతాకాల సమావేశాలు

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక ప్రాంత సమస్యలపై చర్చలకు అవకాశంగా ఉండాలని ఏటా శీతాకాల శాసనసభ సమావేశాలు బెళగావిలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. డిసెంబరు 8నుంచి శీతాకాల సమావేశాలు ఉంటాయని విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ప్రకటించారు. శనివారం ధారవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన శీతాకాల సమావేశాలు బెళగావిలోనే జరుగుతాయన్నారు. ఏర్పాట్లపై వచ్చేవారం బెళగావి జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం జరుపుతామన్నారు.

ఆధారాలు చూపండి..





● అనవసర ఆరోపణలతో కాలం గడపొద్దు : డీసీఎం డీకేశీ ● నాపై సవాల్ విసిరే అర్హత లేదు : కేంద్ర మంత్రి కుమార స్వామి కౌంటర్

బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్రమంత్రి కుమారస్వామి మధ్య మరోసారి మాటలయుద్ధం సాగింది. సవాళ్లు, ప్రతి సవాళ్లతో రెచ్చిపోయారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం తొలిసారి కాకున్నా తారస్థాయిలో వ్యక్తిగతమైన అంశాలను మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో చర్చలు వాద వివాదాలు ఉండాలని, హిట్ అండ్ రన్, బ్లాక్ మెయిల్ చేయరాదని డీకే శివకుమార్ తెలిపారు. తనకు సంబంధించిన ఎటువంటి ఆధారాలైనా తీసుకొచ్చి బహిరంగ చర్చలో పాల్గొనేందుకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. శనివారం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ కుమారస్వామి వద్ద గుట్టలకొలదీ సాక్ష్యాలు ఉంటే రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. ప్రజల మద్దతుతో ఉన్నత హోదాలో ఉన్నారని, ప్రజలమధ్యకు వచ్చి సమాధానం చెప్పాలన్నారు. తప్పుడు ఆరోపణలు చేసి బెదిరింపులు సరికాదన్నారు. జేబు చూపించి పెన్‌డ్రైవ్ ఉంది తీస్తానంటూ చెప్పి ఎన్నేళ్లు అయ్యిందన్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు బహిరంగ చర్చకు నేను సాతనూరుకు వెళ్లలేదా అన్నారు. రెండేళ్ల తర్వాత ప్రభుత్వం కాదు జేడీఎస్‌కు 7-8 స్థానాలు వస్తే గొప్పదన్నారు.

రెండేళ్లలో మాదే ప్రభుత్వం : కుమార

రెండేళ్లలో జేడీఎస్-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం రానుందన్నారు. కాంగ్రెస్ నిలువుదోపిడీ చేస్తోందన్నారు. ప్రజలను ఎన్ని విధాలా పీక్కుతినాలో చూస్తున్నారన్నారు. దేవెగౌడ సీఎంగా ఉన్నప్పుడు ప్రతి చదరపు అడుగుకు 110 రూపాయలు నిర్ణయించారని, నేను సీఎంగా ఉన్నప్పుడు రూ.200 నుంచి రూ.600కు పెంచానన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి చదరపు అడుగుకు వేలాది రూపాయలు నిర్ణయించి లక్షల రూపాయలు లూటీ చేయాలని చూస్తున్నారన్నారు. ఇప్పుడు బీ ఖాతానుంచి ఏ ఖాతాకు మార్చుకోకండి... రెండేళ్ల తర్వాత తక్కువ సొమ్ముతో మా ప్రభుత్వంలో చేస్తామన్నారు. బీ ఖాతా నుంచి ఏ ఖాతాకు మార్చేందుకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల నుంచి 30 లక్షలదాకా ఖర్చు చేయాల్సి ఉంటుందని ఇది మోసం కాదా..? అన్నారు. డీసీఎం ఆహ్వానంపై మీడియా ప్రశ్నకు బదులిస్తూ చర్చలకు ఆహ్వానించేందుకు ఆయను ఎవరని, నన్ను చర్చలకు ఆహ్వానించే అర్హత ఆయనకు లేదన్నారు. బెంగళూరుకు 4,500 ఎలక్ట్రిక్ బస్సులు ఇచ్చానని, మరే ఇతర రాష్ట్రానికి ఇంతగా ఇవ్వలేదన్నారు.

మద్యం మత్తులో కుమారుడిపై కాల్పులు

దొడ్డబళ్ళాపుర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదానికి సంబంధించి తండ్రీ కొడుకుల మధ్య జరుగుతున్న గొడవ కాల్పులకు దారి తీసింది. బెంగళూరు గ్రామీణ జిల్లా దొడ్డబళ్ళాపుర తాలూకా మరళేనహళ్ళి గ్రామంలో శుక్రవారం ఉదయం మద్యం మత్తులో ఉన్న తండ్రితో కొడుకు గొడవపడ్డాడు. హరీశ్(30) తలపై పాతకాలం నాటి డబుల్‌బారెల్‌గన్‌తో తండ్రి సురేశ్ (60) కాల్చాడు. తలకు తీవ్రగాయాలు కాగా బంధువులు అతడిని బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. తీవ్ర చికిత్స అనంతరం ప్రాణాపాయం తప్పింది. అయితే కంటిచూపు కోల్పోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సురేశ్‌ను అరెస్టు చేశారు.



గన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

12 రోజుల్లో..పాతిక కోట్లు

● రికార్డు సృష్టించిన హాసనాంబ ఆలయం
● పూర్తయిన హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హాసనాంబ దేవి ఆదాయం ఈ ఏడు రికార్డు సృష్టించింది. దర్శనం, సిద్దేశ్వరస్వామి జాతర తదితర మార్గాల ద్వారా రూ.25.60 కోట్లు వసూలైనట్లు అధికారులు ప్రకటించారు. గత ఏడాది రూ.12.64కోట్లు ఉండగా అదే అత్యధికంగా ఉండేది. అయితే ఈసారి ఎన్నడూ ఊహించనంతగా భక్తులు తరలిరావడమే ఆదాయం పెరిగేందుకు కారణమైందని జిల్లా అధికారి లతాకుమారి తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి హుండీ ఆదాయం లెక్కింపు పూర్తయ్యింది. హుండీ ఆదాయం లెక్కింపులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు మారుతి పర్యవేక్షించారు. హుండీ ద్వారా రూ.3.68 కోట్లు, రూ.300, రూ.1000 టిక్కెట్లు, లడ్డూ విక్రయాల ద్వారా రూ.21.91 కోట్లుగా ఉన్నట్లు ప్రకటించారు. భక్తులు సమర్పించిన 75.3 గ్రాముల బంగారం, 1.58 కేజీల వెండి వచ్చిందన్నారు. హుండీలో కెనడా, ఇండోనేషియా, అమెరికా, మాల్దీవ్స్‌కు చెందిన కరెన్సీతోపాటు నిషేధించిన కొన్ని 500, 1000 రూపాయల నోట్లు వచ్చాయన్నారు. 12 రోజుల్లో 26,06,691మంది అమ్మవారిని దర్శించుకున్నారు.



హొసహుడ్య వద్ద కల్వర్టుపై నుంచి పారుతున్న వంక

మరువ పారుతున్న వంకలు

చేళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో చెరువులు, వంకలు మరువ పారుతున్నాయి. చేళూరు నుంచి చింతామణికి వెళ్లే మార్గంలో హొసహుడ్య వద్ద వంకలు పొంగి పొర్లుతున్నాయి. చిలకల నేర్పు - ఏనిగదలె మధ్య ఉన్న కల్వర్టుపై మరవ పారుతోంది. గురువారం కురిసిన భారీ వర్షంతో చుట్టుపక్కల వంకలలో నీరు చేరింది. కల్వర్టుపై నీరు వెళ్తుండడంతో రాకపోకలకు అంతరాయం నెలకొంది. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

15నుంచి ఢిల్లీలోనే సీఎం మకాం

● బిహార్ ఎన్నికల తర్వాతే అధిష్ఠానంతో భేటీ ● లేదు..లేదంటున్నా 'నవంబరు క్రాంతి' తప్పదా..?



బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'నవంబరు క్రాంతి' ఉంటుందని అదంతా భ్రాంతి అని ఎన్ని చర్చలు జరిగినా ప్రభుత్వంలో ఏదో ఒక మార్పు తథ్యమని స్పష్టమవుతోంది. తాజాగా సాగుతున్న రాజకీయ పరిణామాలు పెను సంచలనం కానున్నాయనిపిస్తున్నాయి. నవంబరు క్రాంతి ఉండదని సీఎం సిద్దరామయ్య పలు సందర్భాల్లో చెప్పారు. అయితే యతీంద్ర సిద్దరామయ్య ఇటీవల ఓ సభలో సిద్దరామయ్యకు రాజకీయ వారసుడు బెళగావికి చెందిన సీనియర్‌నేత సతీశ్ జార్కిహొళి కానున్నారని వ్యాఖ్యానించిన అంశం చర్చనీయాంశంగా మారింది. సిద్దరామయ్య వర్గీయులు యతీంద్ర వ్యాఖ్యలు అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని కొట్టిపారేస్తున్నారు. డీకే శివకుమార్ వర్గీయులు మాత్రం నాయకత్వ మార్పు ప్రస్తావనకు ముందే కొత్తపేర్లు ప్రస్తావించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఏదో వివాదం చేయాలనే కుట్ర పన్నినట్టు భావిస్తున్నారు. కానీ వేదికలపై సీఎం, డీసీఎంలు కలసికట్టుగా కనిపిస్తున్నా లోపల మాత్రం ఎవరికివారుగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

బిహార్ ఎన్నికల తర్వాత ఢిల్లీకి సీఎం

బిహార్ ఎన్నికల బిజీలో అధిష్ఠానం పెద్దలు ఉన్నారు. నవంబరు 14న బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఆ మరుసటి రోజే సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్తున్నారు. అక్కడే రెండుమూడు రోజులు గడిపే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అధిష్ఠానంతో చర్చలు జరిపేందుకే సీఎం వెళ్తున్నట్టు తెలుస్తోంది. సిద్దరామయ్యకు ఆప్తులుగా ఉండే మంత్రి బైరతి సురేశ్, న్యాయ సలహాదారుడు పొన్నణ్ణలు శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. ఇదే సమయంలోనే మంత్రి ఈశ్వర్ ఖండ్రె కూడా ఢిల్లీలో ఉన్నారు. ఖండ్రె పార్టీ ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలాతో చర్చించినట్టు తెలుస్తోంది. ఆయనపేరు కేపీసీసీ అధ్యక్షరేసులో వినిపిస్తున్న తరుణంలోనే ఖండ్రె ఇటీవల పలుమార్లు ఢిల్లీ వెళ్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి కనీసం మూడు రోజులు ఢిల్లీలో ఉంటారనే సమాచారం మేరకు ముందస్తు ఏర్పాట్లకు మంత్రితోపాటు పొన్నణ్ణ వెళ్లినట్టు తెలుస్తోంది.

అధిష్ఠానం కోరితే రాజీనామా : కృష్ణబైరేగౌడ

అధిష్ఠానం కోరితే మంత్రిపదవికి రాజీనామా చేస్తానని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. శనివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. నవంబరు నాటికి రెండున్నరేళ్లు పూర్తి అవుతుందని, మంత్రివర్గ మార్పు ఉంటుందన్నారు. అధిష్ఠానం కోరితే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు తాను సిద్ధమన్నారు. కృష్ణబైరేగౌడ వ్యాఖ్యలను బట్టి నవంబరులో మార్పులు ఉంటాయని సంకేతం ఇచ్చినట్టయ్యింది.



ట్రయల్‌కోర్టులో వృత్తిని ప్రారంభించాలి

● న్యాయవాదులకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ పిలుపు ● ఘనంగా న్యాయమిత్ర రజతోత్సవాలు



న్యాయమిత్ర సహకారబ్యాంకు రజతోత్సవంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవిందకుమార్

బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యువ న్యాయవాదులు ట్రయల్‌కోర్టులో వృత్తిని ప్రారంభించడం ఉత్తమమని, ఎందుకంటే అక్కడ లభించే అనుభవం మరెక్కడా సాధ్యం కాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఆర్ అరవిందకుమార్ సూచించారు. శనివారం సిటీ సివిల్‌కోర్టు ప్రాంగణంలో న్యాయమిత్ర సహకారబ్యాంకు రజతమహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీఎం డీకే శివకుమార్ తోపాటు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ అరవిందకుమార్ మాట్లాడుతూ న్యాయమిత్ర సహకారసంస్థ 25ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. నావృత్తి జీవనం ప్రారంభమైంది సహకారసంఘంలోనే అని గుర్తు చేసుకున్నారు. తన అన్ని సాధనలు బెంగళూరు సిటీ సివిల్ కోర్టు సహకారబ్యాంకుకే చెందుతాయన్నారు. యువ న్యాయవాదులు ఎక్కువ సమయం ట్రయల్ కోర్టులో గడిపితే వృత్తిలో అనుభవం సాధ్యమవుతుందన్నారు. న్యాయవాదులు సమాజాన్ని మార్పు చేసే డాక్టర్లలాంటివారన్నారు. సమాజం, దేశాన్ని మార్పు చేసే శక్తిసామర్థ్యాలు న్యాయవాదులకు ఉన్నాయన్నారు. న్యాయవాదులకు వసతి, సౌకర్యం, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు భూమి మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అందరికీ న్యాయం చేయడం న్యాయవాదులకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బెంగళూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వివేకొరెడ్డి, న్యాయమిత్ర సహకారబ్యాంకు అధ్యక్షుడు యతిరాజ్, న్యాయవాదులసంఘం జనరల్ సెక్రటరీ ప్రవీణ్‌గౌడ, కర్ణాటక బార్ అసోసియేషన్ అధ్యక్షులు మిత్తల్‌కోడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కాంతుల్లో టీబీడ్యామ్

తుంగభద్రకు నీటి విడుదల

కంప్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర జలాశయం నుంచి శనివారం ఆరు క్రస్ట్‌గేట్లు తెరచి అధికారులు నీరు విడుదల చేశారు. జలాశయం ఎగువన అధిక వర్షాల కారణంగా డ్యామ్‌లో నీటి మట్టం 80 టీఎంసీలకు పైగా చేరింది. దీంతో డ్యామ్ నిపుణుల సలహా మేరకు బోర్డు అధికారులు గేట్లు తెరిచి నీటిని వదిలారు. క్రస్ట్‌గేట్ల భద్రత దృష్ట్యా అధికంగా నీరు నిల్వ ఉంచరాదని సూచించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే నదీతీరాన వుండే గ్రామాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. రాత్రి విద్యుత్ కాంతుల్లో జలాశయం విశేషంగా ఆకట్టుకుంది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు.



తోటలోనే వదిలేసిన బంతిపూలు

అన్నదాతతో బంతి ఆట

● ధరలు లేక బంతిపూల రైతు విలవిల
● మొన్నటి దాకా కిలో రూ.60 నేడు రూ.20

హోసూరు అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): బంతిపూలకు ధర లేక రైతు విలవిలాడుతున్నాడు. హోసూరు సమీపంలోని బాగలూరు, శూలగిరి, డెంకణీకోట, పరిసర ప్రాంతాల్లో ధరలు లేక పోవడంతో తోటల్లోనే పూలు వదిలేస్తున్నారు. దీపావళి సందర్భంగా వారం క్రితం వరకు కిలో రూ.60 నుంచి 70 వరకు పలకగా శుక్ర, శనివారాల్లో కేవలం రూ.12 నుంచి 20 మాత్రమే పలుకుతున్నాయి. దీంతో పూలు కోతకు వచ్చినా కోయలేమని కూలీలు కూడా రావని రైతులు తోటల్లోనే వదిలేస్తున్నారు. తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు.

అవగాహనతోనే బ్రెస్ట్ క్యాన్సర్ నియంత్రణ



వాకథాన్ ప్రారంభంలో నటి ప్రేమ తదితరులు

● అంకాలజిస్ట్ కన్మణి గోవిందరావ్ తేల్కర్ ● వాకథాన్ ప్రారంభించిన నటి ప్రేమ

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ క్యాన్సర్ నియంత్రణకు అవగాహన ముఖ్యమని ప్రముఖ అంకాలజిస్ట్ కన్మణి గోవిందరావ్ తేల్కర్ అభిప్రాయపడ్డారు. 'స్పర్శ్' ఆసుపత్రుల ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై వాకథాన్ నిర్వహించారు. ప్రముఖ నటి ప్రేమ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో 1100మంది ప్రజలు భాగస్వామ్యులయ్యారు. ఉత్తర బెంగళూరులో గులాబీరంగుతో సాగిన వాకథాన్ అందరినీ ఆకర్షించేలా సాగింది. ఈ సందర్భంగా తేల్కర్ మాట్లాడుతూ స్తనక్యాన్సర్ అనేది ప్రారంభంలోనే గుర్తిస్తే వైద్యంద్వారా నయం చేయవచ్చునన్నారు. తీవ్రమైన తరుణంలో వైద్య చికిత్సలు భారంతోపాటు తట్టుకునేశక్తి తగ్గుతుందన్నారు. ప్రారంభంలో గుర్తించడమే తగిన సవాల్ అన్నారు. అంకాలజీ అడ్వైజర్ శశికళ మాట్లాడుతూ క్యాన్సర్‌పై పోరాటం కేవలం ఆసుపత్రులతో మాత్రమే సాధ్యం కాదని నిరంతరం చికిత్సలు, మానవత్వం ముఖ్యమన్నారు. విద్యాసంస్థలతోపాటు ప్రతి వేదికపైనా కనీసం 2 నిమిషాలు క్యాన్సర్‌కు సంబంధించి చర్చ జరగాలన్నారు. అప్పుడే ప్రజలలోకి సమాచారం చేరుతుందన్నారు. వాకథాన్ ఉత్సాహంగా సాగింది. యువతీ యువకులు భారీగా పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.93
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,004	48,221
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	22,902	48,314
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.50

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి

● ఉపాధ్యాయులకు సీఈఓ హ్యారిస్ సూచన



బళ్లారి సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక శాసనమండలి ఈశాన్య ఉపాధ్యాయ నియోజకవర్గంలో అర్హులైన ఉపాధ్యాయులు పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ సూచించారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని, ఓటర్ల జాబితా తయారీ నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయ ఓటర్లను పెద్ద సంఖ్యలో నమోదు చేసుకోవడానికి జిల్లాలో ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యాసంస్థల్లో అక్టోబరు 27, 30,నవంబరు 3 వతేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం, కర్ణాటక శాసన మండలిలోని ఈశాన్య ఉపాధ్యాయ నియోజకవర్గం యొక్క అర్హతగల ఓటర్ల నమోదు కోసం ఈశాన్య ఉపాధ్యాయ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే డివిజన్ అన్ని అర్హతగల ఓటర్ల జాబితాను తయారు చేయడానికి గడువు నవంబర్ 6వరకు పెంచామన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియను అధికారులు వేగవంతం చేయాలన్నారు. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేసుకోవడం, అర్హత కలిగిన ఓటరు ఎవరూ మిస్ అవకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల అధిపతులు ప్రత్యేక ఓటరు నమోదు ప్రచారం నిర్వహించాలన్నారు. ఈప్రత్యేక ఓటరు నమోదు ప్రచారానికి అన్ని సన్నాహాలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

బళ్లారి ప్రజల రుణం తీర్చుకుంటా

●ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ● నగర రహదారులు సుందరంగా మారుస్తానని హామీ ● లక్షమందికి కిచెన్ కిట్ల పంపిణీ

బళ్లారి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తనను గెలిపించిన బళ్లారి నగర ప్రజల రుణం తీర్చుకుంటానని, రాయల్ సర్కిల్, ఎస్పీ, మోకా సర్కిల్, ఇలా అన్ని సర్కిళ్లలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేస్తానని బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన 23వ వార్డులో విలేకరులతో మాట్లాడారు. బళ్లారి నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. తుంగభద్ర డ్యాం నుండి పైపు లైన్ల ద్వారా బళ్లారికి తాగునీరు తెచ్చి 24గంటలూ నీటి సరఫరా చేసి, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. ఎన్నికల్లో నన్ను ప్రతి ఒక్కరూ తన ఇంటిలో బిడ్డగా భావించి గెలిపించారని నీరు ప్రతి కుటుంబంకు అండగా ఉంటూ వారి కుంటుంబంలో ఒక బిడ్డగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇంతక ముందు ఇంటింటికీ కుక్కర్ ఇచ్చామని, ఇప్పుడు ఇంటింటికీ కిచెన్ కిట్లు పంపిణీ చేశామన్నారు. బళ్లారి నగరంలో ఉన్న లక్షాపదివేల కుటుంబాలకు కిచెన్ కిట్లు అందజేస్తున్నామన్నారు. వంటిట్లో ఆడవాళ్లు ఇబ్బంది కలగకుండా వారికి ఉపయోగ పడే వస్తువులు ఇస్తున్నట్లు తెలిపారు. బళ్లారి నగరంకు లా కాలేజీ మంజూరు చేయిస్తామని అన్నారు. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. నారా భరత్‌రెడ్డి అభిమానులు , యువకులు పార్టీలకు అతీతంగా జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. బళ్లారి ఎస్పీ శోభారాణి, ఇతర ఉన్నతాధికారులు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. గర్భిణీలకు వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. పేద ప్రజలకు ఆహార కిట్లు పంపిణీ చేశారు. యువకులు బైక్‌ర్యాలీతో వచ్చి అభినందనలు తెలిపారు. బళ్లారి నగరంలో ఎస్‌జీ కళాశాలలో సినీగాయకులు, సంగీత కార్యక్రమం నిర్వహించారు.



పేదలకు కిచెన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

రైతులను ఆదుకోలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

● కర్ణాటక ప్రాంత రైతు రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు



సమావేశంలో మాట్లాడుతున్న బసవరాజు

కంప్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాల్లో విఫలమయ్యాయని కర్ణాటక ప్రాంత రైతు రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు మండిపడ్డారు. శనివారం కుడితిని పట్టణంలో సీఐటీయు ఏర్పాటు చేసిన జిల్లా సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుడితిని పట్టణంలో 1046 రోజులుగా కర్మాగారాలకు భూములు పోగొట్టుకున్న రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. భూములిచ్చిన కుటుంబంలో ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని కొనుగోలు చేసి ఇంత వరకు పరిశ్రమల ఏర్పాటు చేయలేదు. పిల్లలకు ఉద్యోగాలు కల్పించలేదన్నారు. కావున రైతులు భూములు రైతులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుశాంత్, సత్తిబాబు, శివశంకర్, చంద్రకుమార్, గాలి బసవరాజు, మంజునాథ, తిప్పేస్వామి, జంగ్లీసాబ్, చెన్నబసయ్య, పోలప్ప, వివిధ సంఘాల నాయకులు రైతులు, సీఐటీయు పదాధికారులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేయకపోతే నిరసన తప్పదు

తుంగభద్ర జలాశయం కింద భాగంలో రబీపంటకు నీరు విడుదల చేయకపోతే రాస్తారోకోలు చేపడతామని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బీవీ గౌడ తెలిపారు. శనివారం సంగాత్రేయ పాఠశాలలో రైతులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తెలిపారు. ఏడాది ఖరీఫ్ పంటల్లో తెగుళ్ల వర్షాలతో రైతులు పూర్తిగా నష్టపోయారు. కనుక రబీ పంటలకు కూడా నీరు విడుదల చేసి రైతులకు సహకరించాలని కోరారు. ఐసీసీ సమావేశం బెంగళూరు బదులుగా మునీరాబాద్‌లో జరపాలి. జలాశయంలో రబీ పంటకు కావలసిన నీరు సమృద్ధిగా ఉన్నాయన్నారు. కాబట్టి రైతులను దృష్టిలో వుంచుకుని అలాగే గేట్లు మరమ్మత్తు పనులు చేపడుతూనే రైతులకు నీరు విడుదల చేస్తూ రైతులకు ఆదుకోవాలని కోరారు. నవంబరు మూడు లోగా ఐసీసీ సమావేశం మంత్రులు అధికారులు ఏర్పాటు చేసి రైతులకు అనుగుణంగా నీరు విడుదల చేసేలా సమావేశంలో తీర్మానం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పురసభ అధ్యక్షులు బట్టాప్రసాద్ హేమయ్యస్వామి, ఏసీ దానప్ప, వీరేష్, రమేష్, మురారి, గంగన్న, తిమ్మప్ప, సుదర్శన్, ఆనంద్ గౌడ, సుగూరప్ప, నాగరాజు, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

సండూరులో బీఈడీ, నర్సింగ్ కళాశాల

● గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యే లక్ష్యం
● సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం

బళ్లారి సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణాలు సహా గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధి కోసం త్వరలో సండూరు పట్టణంలో విద్యా కళాశాల, నర్సింగ్ కళాశాలను నిర్మిస్తామని ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం అన్నారు. సండూరు తాలూకాలోని కృష్ణనగర్ గ్రామంలో డీఎంఎఫ్ నిధులతో రూ.75లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవన ప్రారంబోత్సవంలో ఆమె మాట్లాడారు. గ్రామంలోని ప్రజల ప్రయోజనం కోసం ప్రభుత్వ నిధులతో 'జనస్నేహి గ్రామ సౌధ'ను నిర్మించారు. దీనిని తాలూకాలోనే మోడల్ గ్రామ పంచాయతీగా మార్చడానికి అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. కృష్ణనగర్ గ్రామంలో ముస్లిం ప్రజల అభివృద్ధి కోసం మూడు ఎకరాల భూమిలో షాదీ మహల్ నిర్మిస్తామన్నామని, త్వరలో భూమిపూజ చేపడ్తామన్నారు. ఈ సందర్భంగా తాలూకా పంచాయతీ అధ్యక్షురాలు రేణుకా దేవేంద్రప్ప, ఉపాధ్యక్షురాలు ఆషిమా, తాలూకా పంచాయితీ కార్యనిర్వహణాధికారి మదగిన బసప్ప, సహాయ సంచాలకులు మహేశ్, రేణుకాచార్యస్వామి, నాయకులు సిద్దనగౌడ, జిలాన్, పీడీఓ కార్యదర్శి , పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

8నుంచి సాహిత్య సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు, సాహితీవేత్త మరళసిద్దప్ప

బళ్లారి సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజముఖి సార థ్యంలో నవంబరు 8, 9వ తేదీల్లో సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వైద్యుడు సాహితీవేత్త మరళసిద్దప్ప తెలిపారు. శనివారం నగరంలోని ఐఎంఏ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నవంబరు 8,9వ తేదీల్లో బెంగళూరు స్కౌట్స్ గైడ్స్ సభాభవనంలో సమాజ ముఖి ప్రథమ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జరిగే కన్నడ సాహితీవేత్తలకు ప్రాధాన్యం లభించడంలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కన్నడ సాహిత్యంతోపాటు కళలప్రదర్శనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈసమ్మేళనంలో 1000 మందికిపైగా సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. ఈసమ్మేళానానికి బరగూరు రామచంద్రప్ప,శవిప్రకాశ్ తదితరులుపాల్గొంటారన్నారు. ఈసందర్భంగా డాక్టర్ అరవింద్‌పాటిల్, డాక్టర్ జయశ్రీ,డా.మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

గ్రామీణాభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కృష్ణగిరి జిల్లాలో 10 బ్లాక్‌లలో 30 వైద్య శిబిరాలు, కార్పొరేషన్‌తో కలిపి 33 వైద్య శిబిరాలు 3 వైద్య శిబిరాలు కొనసాగాయి. ఇప్పటివరకు కృష్ణగిరి జిల్లాలోని హోసూరు కార్పొరేషన్, బాగలూరు, తళి, కెలమంగళం, ఆలపట్టి, సూలగిరి, వేపనపల్లి, బర్గూరు, మద్దూరు, మరియు సింగారపేట ప్రాంతాలలో ముఖ్యమంత్రి స్టాలిన్ వైద్య శిబిరాలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా సాగిన వైద్య శిబిరాలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. ఊత్తంగరై ప్రభుత్వ బాలూర హయ్యర్ సెకండరీ స్కూల్ ఆవరణలో ముఖ్యమంత్రి పథకం వైద్య శిబిరం జరిగింది. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీకి మెడికల్ కన్సల్టేషన్, ఆర్థోపెడిక్స్, ప్రసూతి - గైనకాలజీ, పీడియాట్రిక్స్ కార్డియాలజీ, న్యూరాలజీ, డెర్మటాలజీ, డెంటిస్ట్రీ, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ, మానసిక ఆరోగ్యం మరియు రక్త పరీక్షలు, స్కాన్ పరీక్షలు, ఎక్స్-రే, ఈసీజీ, ఈసీహెచ్‌ఏ, కంటి పరీక్షలు, నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు, అధిక రక్తపోటు, మూత్రపిండాల పరీక్షలు, సిద్ధ వైద్యం వంటి పలు నిపుణులైన వైద్యులు పరీక్షలు చేశారు. 1,740 మంది నమోదు చేసుకుని చికిత్సలు పొందారు. క్షయవ్యాధితో బాధపడుతున్న వారికి టిబి మాత్రలను, శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకుని అవసరమైనవారికి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. శిబిరంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ తరఫున 55 మంది వికలాంగులకు గుర్తింపు కార్డులు, 31 ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా కార్డులను ప్రజలకు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తదనంతరం జిల్లా కలెక్టర్ సింగారపేట పంచాయతీలోని నీటి పారుదల కాలువలను పరిశీలించారు. కార్యక్రమంలో తిరుపత్తూరు జిల్లా అటవీ అధికారి మహేంద్రన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, జిల్లా ఆరోగ్య అధికారి రమేశ్ కుమార్, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ అధికారి శివకుమార్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్ పాల్గొన్నారు.

వైభవంగా స్కందషష్ఠి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

హోసూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలలో స్కందషష్ఠి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ప్రతినెలా శుక్ల షష్ఠి ని స్కందషష్ఠిగా ఆచరిస్తారు. హోసూరు బృందావన్‌నగర్‌లో వల్లీ దేవసేన సమేతంగా రాజదర్బార్ అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఆలయంలో 13వ వార్షిక స్కంద షష్ఠి ఉత్సవాలు 21వ తేది నుంచి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజూ ఒక్కొక్క అలంకరణతో స్వామి దర్శనం ఇచ్చారు. ప్రతి రోజూ స్వామి వారికి అర్చనలు, శంఖాబిషేకం, వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. దీపారాధన అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శనివారం రాజదర్బార్ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు శూర సంహార కార్యక్రమం జరుగుతుంది. శూరసంహారంలో అమ్మవారినుంచి కత్తిని తీసుకుని అసురుని సంహారం చేసే కార్యక్రమం జరుగనున్నట్లు అర్చకులు తెలిపారు,

యూనియన్ స్థాయిలో రాణించిన విద్యార్థులు

హోసూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కళోత్సవం పోటీల్లో యూనియన్‌స్థాయిలో విద్యార్థులు రాణించారు. హోసూరు పరిధిలోని మూడో వార్డు బేడరపల్లి కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 14, 15 తేదీలలో 1వ తరగతి నుంచి 8 వ తరగతి వరకు విద్యార్థులకు యూనియన్ స్థాయి కళాకారుల పోటీలు జరిగాయి. ఆర్‌వీ ప్రభుత్వ పాఠశాలలో పోటీలు కొనసాగాయి. శనివారం బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో యూనియన్ స్థాయిలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందచేశారు. ప్రధానోపాధ్యాయుడు పొన్‌నాగేశ్, ఉపాధ్యాయులు ప్రశంసించారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు నాగేశ్

చక్కెర కర్మాగారం నిర్మించాలని రైతుల వినతి

బళ్లారి సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో చక్కెర కర్మాగారం ఏర్పాటు సహా ఇతర డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేస్తూ జిల్లాఅధికారికి వినతి పత్రం శనివారం అందజేశారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.గోనిబసప్ప మాట్లాడుతూ జిల్లాలో చక్కెర కర్మాగారం ఏర్పాటుకు రాజకీయ నాయకులు అడ్డు పడడం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జోక్యం చేసుకుని జిల్లాలో చక్కెర కర్మాగారం ఏర్పాటు చేయాలన్నారు. అప్పుడే చెరకు రైతుకు తగిన న్యాయం జరుగుతోందన్నారు. వర్షాకాలం కారణంగా జిల్లాలో మొక్కజొన్న పంట ఎక్కువగా పండింది. క్వింటాలుకు రూ. 1700 నుంచి 1900 ధరకు అమ్ముడుపోతోందని, ఈ ధరతో రైతులకు తీవ్ర నష్టం తప్పదన్నారు.జిల్లాలోని అన్ని తాలూకాల్లోని రైతుల పంపుసెట్లకు తగినంత విద్యుత్ అందించాలని, ఆశాస్త్రీయ పద్ధతిని అరికట్టాలని రైతు నాయకులు కోరారు. ఈసందర్భంగా తాలూకా అధ్యక్షుడు గంటా సోమశేఖర్, హగరిబొమ్మనహళ్ళి గౌరవ అధ్యక్షుడు మమేశ్, నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న రైతు నాయకులు

ఘనంగా నారా భరత్ రెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న మాజీమేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు

బళ్లారిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వివిధ వార్డుల్లో బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కార్పొరేటర్లు, అధికారులు నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. గజమాలతో ఎమ్మెల్యేని సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. భారీ కేక్‌ను కట్ చేసి క్రేన్ల ద్వారా పూలహారాలు వేస్తూ నగరంలో బైకు ర్యాలీలు నిర్వహించారు. 35వ వార్డు మించు శ్రీనివాస్ నేతృత్వంలో నగరంలో పెద్దఎత్తున బైకు ర్యాలీ నిర్వహించి భరత్ రెడ్డికి ఘన సన్మానం నిర్వహించారు. మాజీ మేయర్ రాజేశ్వరి నేతృత్వంలో భరత్ రెడ్డిని గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చానాల్ శేఖర్, మించు శ్రీనివాస్, ప్రభంజన్, సుబ్బారాయుడు, శ్రీధర్, హగరి గోవిందు, వన్నప్ప, అమర్ కార్యకర్తలు పాల్గొని జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

శ్రీధర్ నాయకత్వంలో..

నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం ఉదయం హొస్పేట నుంచి బళ్లారి నగరానికి మహాదేవ తాత మఠం సమీపంలో వ్యాపారవేత్త, రాజకీయ నాయకులు శ్రీధర్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ అభినందనలు తెలిపారు. అనంతరం అక్కడి నుండి వందలాది మంది ద్విచక్రవాహనాల్లో ర్యాలీతో కనక దుర్గమ్మ ఆలయానికి చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ వీరారెడ్డి, అమర్ గఫూర్ కాంగ్రెస్ నాయకులు వీరేంద్ర కుమార్ ధనుంజయ కాంగ్రెస్ వందలాది మంది కార్యకర్తలు స్వాగతం పలికారు.

రోగులకు పాలు పండ్లు పంపిణీ

కంప్లి: బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం కంప్లి పట్టణంలో పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరివి బసవన్న గౌడ, మూకయ్యస్వామి, వస్కోటి జగదీష్ మాట్లాడుతూ నారా భరత్ రెడ్డి చేసిన సమాజ సేవలే గుర్తింపుని చ్చాయన్నారు. నెల్లూడి కరిబసవనగౌడ, శశికుమార్, భలే మల్లికార్జున, ఆనంద్, మనోహర్, రాజా లింగప్ప, నాగరాజు, గంగాధర, రాజబక్షి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పాలు పండ్లు పంపిణీ చేస్తున్న వస్కోటి జగదీష్



మహదేవతాత మఠం వద్ద ఎమ్మెల్యేని అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు శ్రీధర్, అమర్, గఫూర్ తదితరులు

నేలవాలిన పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ మంజునాథరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిరుగుప్ప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలో భారీ వర్షాల కారణంగా నేలమట్టమైన పంటలను వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథరెడ్డి శనివారం పరిశీలించారు. భారీ వర్షాలకు పంటలు నేలకూలినా పట్టించుకోవడం లేదంటూ ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై వ్యవసాయ అధికారులు స్పందించారు. తాలుకాలోని ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలో వున్న నేలమట్టమైన వరి పంటలను వారు పరిశీలించారు. 35,323 హెక్టార్లలోని వరి పంట నేలమట్టమయ్యిందని, పూర్తిగా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు.

వర్షాలకు కూలుతున్న ఇళ్లు



రామసాగర్‌లో కూలిన ఓ ఇల్లు

కంప్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాలుకాలో నాలుగు ఇళ్లు కూలిపోయాయి. పాత ఇళ్లు కూలిపోవడంతో యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ లెక్క అధికారులు ఆ గ్రామాల్లో సర్వే చేపడుతున్నారు. జవుకులో ఒకటి, హంపదేవనహళ్లిలో ఒకటి, రామసాగరంలో రెండు ఇల్లు కూలాయని తహసీల్దార్ మంజునాథనాయక్ తెలిపారు. పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కనుల పండువగా కార్తీక దీపోత్సవం




మారెమ్మ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సిరుగుప్ప, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కార్తీక శుక్రవారం సందర్భంగా సిరుగుప్ప పట్టణం కెంచనగుడ్డ రోడ్డు మార్గంలో వెలసిన గాలి మారెమ్మ దేవి ఆలయ ఆవరణంలో 25 దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు చొక్కా బసవన గౌడ, నగరసభ మాజీ అధ్యక్షులు నాంచారయ్య, బీజేపీ జిల్లా యువ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, బుడగ జంగమ సంఘం అధ్యక్షులు జంబన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లారెడ్డి, భక్తులు మహిళలు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ద రా బేంద్రె (వర్ధంతి)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత దత్తాత్రేయ రామచంద్ర బేంద్రె (ద రా బేంద్రె) 1896 జనవరి 31న ధార్వాడలో జన్మించారు. కన్నడలో కథలు, కవిత్వం, విమర్శ, అనువాదం చేసి 'వరకవి'గా పేరొందారు. 'అంబికాతనయ దత్త' కలం పేరిట రచనలు చేశారు. 'నాకు తంతి' రచనకు 1964లో జ్ఞానపీఠ పురస్కారం దక్కింది. ఉడుపి అదమారు మఠం నుంచి 'కర్ణాటక కవి కుల తిలక' గౌరవాన్ని అందుకున్నారు. ఆయన జీవితం, సాహిత్యంపై ప్రముఖ దర్శకుడు గిరీశ్‌కర్నాడ్ ఒక డాక్యుమెంటరీని రూపొందించారు. సాహిత్య అకాడమీ, కేల్కర్ ప్రైజ్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1981 అక్టోబరు 26న కన్నుమూశారు.

హిల్లరీ క్లింటన్ (పుట్టినరోజు)



హిల్లరీ డయానె రోధమ్ క్లింటన్ 1947 అక్టోబరు 26న జన్మించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటన్ సతీమణి. 1993 నుంచి 2001వరకు 'ఫస్ట్ లేడీ ఆఫ్ యూఎస్‌ఏ'గా కొనసాగారు. న్యూయార్క్ సెనేటర్‌గా 2001 నుంచి 2009 వరకు వ్యవహరించారు. అధ్యక్షుడు బారక్ ఒబామా హయాంలో యూఎస్ సెక్రటరీగా వ్యవహరించారు. పలు పుస్తకాలు రచించారు. యేల్ లా స్కూల్ ఎడిటోరియల్ బోర్డ్‌లోనూ ఉన్నారు. 2023 నుంచి స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో ఫ్యాకల్టీగా కొనసాగుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా సోమందేపట్టి మండలంలోని పాపిరెడ్డిపల్లివద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడిపల్లికి చెందిన రవి, గంగరత్నమ్మ గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు రవి, గంగరత్నమ్మ పనినిమిత్తం సోమందేపల్లికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా పాపిరెడ్డిపల్లివద్ద రోడ్డు దాటడానికి వాహనాన్ని ఆపారు. వెనుకే వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. గంగరత్నమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అగళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలం ఎంఎం పాళెం గ్రామానికి చెందిన మహేష్(55) బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు గత వారం మహేష్ తన మిత్రులతో కలిసి మంత్రాలయం వెళ్లాడు. అక్కడి నుంచి వస్తుండగా లారీ, కారు ఢీకొని ఇరువు గాయపడ్డారు. మహేష్ తలకు బలమైన గాయాలుకాగా బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మహేష్‌కు భార్య మమత, కుమారుడు ఉన్నారు. ఇరుయూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనాన్ని వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన వాహనం

సోమందేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొంద్రాయనపల్లివద్ద జాతీయరహదారి పక్కన హోండా యాక్టివా వాహనాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వాహనం ముందు భాగం డ్యామేజ్ అయిందని ఐదు రోజులుగా ఇక్కడే ఉందన్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంట్లో చోరీ

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దండురోడ్డులో నివాసముంటున్న రవికుమార్ ఇంట్లో చోరీ జరిగినట్లు వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. రవికుమార్ కుటుంబ సభ్యులు తమిళనాడుకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి తలుపులు వేసి ఉండగా చోరీ జరిగింది. పక్కింటివారు పోలీసులకు సమాచారం ఇవ్వగా పుట్టపర్తి నుంచి క్లూస్ టీమ్ రప్పించి పరిశీలించారు. ఇంట్లో ఉన్న ఎనిమిది తులాల బంగారు నగలు, రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు రవికుమార్ శనివారం రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు చాకర్లపల్లి గేటు మూసివేత

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లివద్ద రైల్వేగేటు ట్రాక్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు మూసివేయనున్నట్లు రైల్వే సెక్షన్ ఇంజనీర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈమేరకు రెవెన్యూ, ఆర్టీసీ, పోలీసువారికి కాపీలను అందించారు. ప్రయాణికులు జాతీయరహదారిగుండా ప్రయాణించాలని ఆయన సూచించారు.

అసమానత తొలగేందుకు విద్యావంతులు కావాలి

» సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ నిర్మాణమే కాకుండా సమాజంలో అసమానత తొలగేందుకు ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. శనివారం జామియా మసీదు, ముస్లిం చారిటబుల్ ఫండ్ ట్రస్టు నిర్వహణలోని జేయూ గ్రూప్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన దారుల ఖురాన్ క్యాంపస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మతం ఏదైనా ప్రతి ఒక్కరికీ విద్య ముఖ్యమన్నారు. స్వాభిమానంతో జీవించేందుకు విద్య దోహదపడుతుందన్నారు. సమాజంలోని అసమానతలు తొలగేందుకు విద్య తప్పనిసరి అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారన్నారు. విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, ఇందుకు అనుగుణంగా గ్రాంట్లు ఇస్తున్నామన్నారు. కాగా వసతి పాఠశాలలను స్థాపించి ముస్లింలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యకు అనుకూలమైందన్నారు.

రెచ్చగొట్టేది లేదు

తమ మతాన్ని పాటిస్తూ ఇతర మతాలను గౌరవించాలని సూచించారు. సహజీవనం, సామరస్యం పాటించాలని రాజ్యాంగంలో పేర్కొనబడిందన్నారు. ద్వేషం వల్ల ఎవరి మనస్సును గెలుచుకోలేరన్నారు. ఇందుకు ఎంతో జాగృతి కావాలంటే విద్య అవసరమన్నారు. కార్యక్రమంలో మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, సీఎం రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, మౌలానా మక్సూద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



దారుల్ ఖురాన్ క్యాంపస్ ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య తదితరులు

రచనలతో కొత్త ఆలోచనలకు ఆస్కారం



ప్రసంగిస్తున్న జస్టిస్ నాగమోహన్ దాస్



వ్యాసరచన పోటీలలో విద్యార్థులు

» హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్ దాస్

» రాజ్యాంగంపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రచనలతో వ్యక్తిగత అభి ప్రాయాలు పెరుగుతాయని అప్పుడే కొత్త ఆలోచనలతో పలు విషయాలు తెలుసుకునేందుకు వీలుంటుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఎన్ నాగమోహన్‌దాస్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 'సంవిధాన ఓదు అభియాన' (రాజ్యాంగం చదువు) ఆధ్వర్యంలో రాజ్యాంగంపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు శనివారం జరిగాయి. జస్టిస్ నాగమోహన్‌దాస్ పోటీలను ప్రారంభించిన సందర్భంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మొబైల్, సోషల్‌మీడియాకు బానిసలుగా మారుతున్న యువత రచనల విషయంలో వెనుకబడుతున్నారన్నారు. భావనలులేని విషయజ్ఞానం ఎదుగుదలకు సముచితం కాదన్నారు. విద్యార్థిదశలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో భాగస్వామ్యులు కావాలన్నారు. తాను విద్యార్థి దశలోనే సామాజిక అంశాలపై ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొనేవాడినన్నారు. తద్వారా న్యాయవాదిగా పలు వాదనలు వినిపించేందుకు, ఆ తర్వాత న్యాయమూర్తిగా వేలాది తీర్పులు రాసేందుకు దోహదపడ్డాయన్నారు. మన రాజ్యాంగం ఈ కాలానికి ధర్మమైనదన్నారు. సమసమాజ నిర్మాణానికి రాజ్యాంగమే దారిదీపమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగమే ఓ ఆలయమని వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకోవడమే నిజమైన పూజ అన్నారు. 1915లో ఈ కళాశాలకు మహాత్మాగాంధీ వచ్చారని గుర్తు చేశారు. కన్నడ అధ్యాపకులు రుద్రేశ్ అదరంగి మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల డిగ్రీ విద్యార్థులకు ఒక దిశానిర్దేశం చేయాలనే రెండో ఏడాది 'సంవిధాన ఓదు' సంస్థ సహకారంతో వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 550మంది విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారన్నారు. 'సంవి ధాన ఓదు' అభియాన ముఖ్యులు రాజు గోరూరు, రాజశేఖరమూర్తి, హరి హెచ్ఎన్, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్, రవికుమార్, శశికళ, నారాయణ హెచ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

ఓటమికి ఎన్నో కారణాలు

» కేపీసీసీ ప్రధాన కార్యదర్శి కేవీ గౌతమ్



కాంగ్రెస్ కార్యాలయంలో కేవీగౌతమ్‌కు సన్మానం

ముళబాగిలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభ ఎన్నికల్లో తన ఓటమికి ఎన్నో కారణాలు ఉన్నాయని కాంగ్రెస్ ఓటమి అభ్యర్థి, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి కేవీ గౌతమ్ అభిప్రాయపడ్డారు. కేపీసీసీ ప్రధాన కార్యదర్శి అయిన అనంతరం తొలిసారి ముళబాగిలుకు విచ్చేసిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయనను ఆత్మీయంగా స్వాగతించారు. తనకు కోలారు లోక్‌సభ కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వడానికి ముందే హైకమాండ్ వద్ద మాజీ మంత్రి మునియప్ప అల్లుడు, మాజీ స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ మద్దతుదారులు ఉన్నారన్నారు. ఎన్నికలు ఎదుర్కొనడానికి కేవలం 18రోజులు మాత్రమే ఉండడం, బీజేపీ-జేడీఎస్ మైత్రి వల్ల ఓటమి తప్పలేదన్నారు. కోలారు లోక్‌సభ ప్రజలు తనకు 6.25 లక్షల ఓట్లు వేశారన్నారు. 60వేల ఓట్లతేడాతో ఓటమి చెందానన్నారు. రానున్న ఎన్నికల్లో తాను అభ్యర్థి కావడం ఖాయమని, 2లక్షల మెజారిటీ సాధిస్తానన్న విశ్వాసం వ్యక్తం చేశారు. కోలారు జిల్లాలో కేహెచ్ మునియప్ప, కేఆర్ రమేశ్‌కుమార్ సీనియర్ నాయకులని వారిని ఒప్పించి రెండు గ్రూపులను ఏకం చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. కాగా ఆవని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంసీ నీలకంఠేగౌడ మృతి చెంది సుమారు 6 నెలలు కావస్తోందని త్వరలోనే ఈ స్థానాన్ని భర్తీ చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కాగా మహదేవపుర నియోజకవర్గంలో 1 లక్ష బోగస్ ఓట్లు చేర్చడం ద్వారా కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయారన్నారు. అదేరీతిన వారణాసిలో కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఓటమికి ఎన్డీయే ఓటుచౌర్యానికి పాల్పడిందని తీవ్రంగా ఆరోపించారు. ఓటు చౌర్యంపై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఓటు చౌర్యంపై రాష్ట్రవ్యాప్తంగా జాగృతి చేపడతామన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభిషేక్‌దత్ ఆదివారం ముళబాగిలుకు విచ్చేస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలనుంచి సంతకాల సేకరణ చేపట్టి రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కేడీపీ సభ్యుడు కార్గిల్ వెంకటేశ్, సిద్దగట్ట మునిస్వామి గౌడ, దరఖాస్తు సమితి సభ్యుడు కృష్ణప్ప, కాంగ్రెస్ ప్రముఖులు డాక్టర్ రమేశ్, యూత్‌కాంగ్రెస్ వేణుకుమార్, సతీశ్ తదితరులు ఉన్నారు.

డిసెంబరు 1నుంచి అంగన్‌వాడీల నిరవధిక ధర్నా



తాలూకా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు రత్నమ్మ

బాగేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంగన్‌వాడీ ఉద్యోగులు వివిధ డిమాండ్లతో డిసెంబరు 1నుంచి 10వరకు పదిరోజులపాటు కేంద్రమంత్రి ఇంటి ముందు నిరవధిక ధర్నా చేపడుతున్నట్టు తాలూకా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు రత్నమ్మ తెలిపారు. పట్టణ శివారులోని దేవరగుడిపల్లి ఆర్యవైశ్య కల్యాణమండపంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మీడియాతో మాట్లాడారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి ఐసీడీఎస్ పథకాన్ని పర్మనెంట్ చేయాలన్నారు. గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం సీ, డీ గ్రూప్ వారిని ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. 2018 నుంచి అన్వయించేలా వేతనాన్ని పెంచి లబ్ధి దారులకు మరింత ప్రయోజనం కల్పించాలన్నారు. వినతికి స్పందించకుంటే డిసెంబరులో కేంద్రమంత్రి ఇంటిముందు నిరవధిక ధర్నా చేసేలా నిర్ణయించామన్నారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మీదేవమ్మ, తాలూకా కార్యదర్శి కే గీతా, కోశాధికారి శిల్ప, గంగరత్నమ్మ, విమలా, రవణమ్మ, అలవేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయవాదికి సన్మానం

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): న్యాయసేవలలో 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కర్ణాటక హైకోర్టు న్యాయవాది కేవీ నరసింహన్‌ను బెంగళూరు జ్ఞానజ్యోతి ఆడిటోరియంలో శనివారం ఆత్మీయంగా సత్కరించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవిందకుమార్ అతిథిగా పాల్గొని సన్మానం చేసి మాట్లాడారు. నరసింహన్ సదా నవ్వుముఖంతో ఉంటారన్నారు. కోర్టులో ఆయన ఒకరోజు కూడా విసుగు చెందడం తాను చూడడం లేదన్నారు. ఎవరినైనా ఒప్పించగల సామర్థ్యం ఉందన్నారు. అందరికీ సులభం అయ్యేలా వాదనలు చేస్తారన్నారు. చట్టపరిధిలో ఈ కేసు ఎందుకు వచ్చిందో జడ్జికి కూడా అర్థమయ్యేలా చెప్పే సామర్థ్యం నరసింహన్‌కు ఉందన్నారు. ఆయన వృత్తి జీవనం జూనియర్ లాయర్లకు రోల్‌మోడల్ అన్నారు. ఇదే సందర్భంగా 'ఏ లైఫ్ ఇన్ లా' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అతిథులుగా భారత అటార్నీ జన రల్ ఆర్ వెంకటరమణి, విద్వాంసుడు దుశ్యంత్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయవాది కేవీ నరసింహన్‌కు సన్మానం

కాపర్ వైరు చోరీ ముఠా అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీకాంత్, ఇతర అధికారులు

అనంతపురం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో బీఎస్ఎన్‌కు చెందిన కాపర్ కేబుల్‌ను చోరీ చేసిన దొంగల ముఠాలో 12మందిని అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 40 వేల విలువైన రాగి వైరు, ఒక ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సీఐ శ్రీకాంత్ యాదవ్ స్టేషన్‌లో శనివారం రాత్రి వెల్లడించారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ముందు భూమిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కేబుల్ చోరీ చేసిన దొంగలను పట్టుకోవాలంటూ బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఆఫీసర్ గంగాధర్ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో లభించిన చిన్న ఆధారాన్ని పట్టుకుని దర్యాప్తులో ముందుకెళ్లారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో నిందితులున్నట్టుగా సమాచారం రావడంతో వెళ్లి అరెస్టు చేశారు. అరెస్టయిన నిందితులు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. అరెస్టయిన వారిలో వేముల ఉదయ్‌భాస్కర్(25),వేముల ఏసుబాబు(28),వేముల శివనారాయణ(27), నక్కా తిరుమల శ్రీనివాసులు(21),వేముల వేంకటాద్రి(25), గుజ్జదుర్గారావు(35), గుజ్జశీను(30), గాలి రాజు(50), గాలి చంటి(28),వేముల సుబ్బరాజు(33), గుజ్జ సింహాద్రి(24), చల్లా దుర్గారావు(38) ఉన్నారు. ఈ కేసులో మొత్తం 17 మంది నిందితులున్నారని, మిగతా ఐదుగురిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

వంతెన లేక విలవిల



రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని చూపుతున్న గ్రామస్థుడు

శిడ్లఘట్ట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లాలో రెండో అతిపెద్ద చెరువు, శిడ్లఘట్ట తాలూకాలోని అతిపెద్ద చెరువు దేవగానహళ్ళి రామసముద్ర చెరువు భర్తీ అయి మరవపారుతోంది. తాలూకాలోని ఉత్తర ప్రాంతంలో కొండగుట్టల నడుమ ఎన్నో చెరువులు ఉన్నాయి. వీటిలో రామసముద్ర చెరువు మినహా అన్నీ చిన్నవే. మైసూరు సంస్థాన చామరాజ ఒడెయర్ కాలంలో ఇస్మాయిల్ దివాన్‌గా ఉన్న వేళ సుమారు 130 ఏళ్లక్రితం ఈ చెరువు నిర్మించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం చెరువు మరవపారుతోంది. ఎస్ గుండ్లహళ్ళి, ఎస్ దేవగానహళ్ళి, ఎరగనహళ్ళి, కొండప్పగారహళ్ళి, గడిమంచేన హళ్ళి, జేరదహళ్ళి, వరదనాయకనహళ్ళి, ఎస్ కురుబరహళ్ళి, ఎస్ దేవగాన హళ్ళి తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో రాకపోకలకు అంతరాయం నెలకొం ది. మరవపారే ప్రదేశంలో బ్రిడ్జ్ నిర్మించాలని ఎస్ గుండ్లహళ్ళి గ్రామస్తులు కోరుతున్నారు.

రైతుల నిరసన



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

దొమ్మసంద్ర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారులోని ఆనేకల్ తాలూకా తమ్మనాయకనహళ్ళిలో రైతులు, పారిశ్రామికవేత్తల నడుమ భూ వివాదం తారస్థాయికి చేరుకుంటోంది. ఇందుకు కారణం అధికారుల నిర్లక్ష్యమేనని తెలుస్తోంది. సుమారు 70 సంవత్సరాలుగా రైతులు సాగు చేస్తున్న భూమిని క్రషర్ యూనిట్‌కు తిరిగి కేటాయించిన అంశం ఇటీవల వెలుగు చూసింది. సర్వే 23లో 622 ఎకరాల ప్రభుత్వ గోమాల భూమిని 1952లో సుమారు 296మందికి పంచారు. వీరిలో చౌడప్ప, భార్య పటేలమ్మలకు 4 ఎకరాల 38 గుంటలను మంజూరు చేశారు. వీరు సుమారు 70ఏళ్లుగా వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే 2016లో మంజునాథ్ స్టోన్ అండ్ మైనింగ్ కంపెనీకి సర్వే 1లోని 25 గుంటలను క్రషర్ యూనిట్ ఏర్పాటుకు గనులశాఖ అనుమతి ఇచ్చింది. దీన్ని ఖండిస్తూ రైతులు పటేలమ్మ, ఆమె కుమారుడు శ్రీనివాస్‌లు నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు డబ్బుల ఆశతో తమ సాగుభూమిని ఇతరులకు అక్రమంగా కేటాయించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, గనులశాఖ, జిల్లాధికారులు సంయుక్తంగా సర్వే చేసి తమకు న్యాయం కల్పించాలని కోరారు.

మోసగాళ్లకు మంత్రి మద్దతు..?

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా పెరేసంద్రకు చెందిన మొక్కజొన్న రైతులకు మోసం చేసిన కేసులో తెలంగాణ వ్యాపారులకు మద్దతుగా మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ నిలిచారు. పెరేసంద్ర సబ్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్‌రెడ్డికి ఫోన్‌లో మాట్లాడిన ఆడియో శుక్రవారం వైరల్ అయ్యింది. సదరు ఆడియోను సోషల్‌మీడియాలో వైరల్ చేసిన జేడీఎస్ పార్టీ సదరు మంత్రిపై విరుచుకుపడింది. బాధ్యతాయుతమైన మంత్రి రైతులకు మోసం చేసిన వ్యాపారులకు మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అన్నారు. నాసిర్, అబ్దుల్‌రజాక్, రామకృష్ణ, అక్బర్‌బాషాలపై రైతుల ఫిర్యాదుకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాష్ట్రంలో అన్యాయానికి గురైన రైతులకు మద్దతు ఇచ్చేలా మాట్లాడాల్సిన మంత్రి, 'తెలంగాణకు చెందిన వ్యాపారులు మావారేనని కాస్త చూసుకుని పోవాలంటూ...' చేసిన వ్యాఖ్యలు ఆడియోలో ఉన్నాయి. రౌడీలు, సెటిల్‌మెంట్‌లు చేసేవారు, మోసగాళ్లకు మద్దతు ఇచ్చే మంత్రి జమీర్‌ను క్యాబినెట్‌నుంచి తొలగించాలని జేడీఎస్ డిమాండ్ చేసింది.

హంపికి పోటెత్తిన భక్తులు

కంప్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన హంపి పుణ్యక్షేత్రంలో పర్యాటకులు పోటెత్తారు. రెండు రోజులు సెలవులు రావడంతో రాష్ట్రంతో పాటు ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, విదేశీయులు పర్యాటకులు హంపికి పోటెత్తారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా హంపిని తిలకించడానికి విద్యార్థులు తరలివచ్చారు. గత రెండు మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తూనే వున్నాయి. అయినా వర్షాన్ని లెక్కచేయకుండా తిలకించడానికి భారీస్థాయిలో తరలివచ్చారు. హంపి విరుపాక్షేశ్వర పార్వతి, భువనేశ్వరి ఎదురు బసవన్న కోదండ రామ యంత్రోత్పాదక ఏకశిలా రథం నవదిబ్బ పుష్కరిణి గజశాల, ఆకట్టుకునే మండపాలు ఆలయాలలో ఎక్కడ చూసినా పర్యాటకులే కనిపిస్తున్నారు.



ఏకశిలా రథం వద్ద భక్తుల సందడి